
www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

మంగళవారం 13 మే 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



3లో

## సిందూర్ పేరు కాదు.. ప్రజల మనోభావం

ప్రధాని నరేంద్ర మోదీ




## ఆర్టీఐ కమిషనర్లుగా నలుగురు

- ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- ముగ్గురి నియామకంపై అభ్యంతరం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

7లో

*Your dreams come true at...*

ESTD: 2003

MOTHER'S LAND E/M HIGH SCHOOL

P. Ramesh M.A. HPT, Chairman

✦ NURSERY to X CLASS ✦ IIT NEET & MEDICAL FOUNDATION ✦ DAY, SEMI RESIDENTIAL & RESIDENTIAL

Main Branch: Near Subhash Statue, Narsampet. ✆ 9959284472, 9704316282

**HOSTEL CAMPUS:** Beside Reddy Function Hall, Nekkonda Road, Narsampet.



561 /600

B. Likhitha Reddy

HT: 2511101855




OUR SSC - 2025 TOPPERS

| Marks | Name | HT No. |
|---|---|---|
| 545 | T. GANESH | 2511101881 |
| 544 | G. HASWADHAMA | 2511102566 |
| 540 | V. AKSHAYA | 2511101423 |
| 538 | D. NITHISHA | 2511101815 |
| 536 | E. JASHVANTH | 2511102268 |
| 536 | D. SIDDARTHA | 2511102266 |
| 522 | S. SINDHURA | 2511102450 |
| 518 | J. SRIVIDHYA | 2511102232 |
| 517 | K. KARTHIK | 2511102338 |
| 510 | K. RITHWIK CHANDRA | 2511102308 |
| 504 | M. VIGNESHWARA CHARY | 2511101967 |
| 501 | M. SAI MANOJ | 2511102042 |
| 500 | K. SWARNANJALI | 2511101953 |
| 500 | N. LAXMI SHRAVYA | 2511102312 |
| 499 | G. VISHWANTH | 2511101961 |
| 498 | K. RANJITH | 2511101515 |
| 497 | M. SINDHU SUPRAJA | 2511102026 |
| 495 | M. RUTHWIKA | 2511101535 |
| 495 | M. ROHITH | 2511101853 |
| 492 | B. MANIKANTA | 2511101647 |
| 487 | G. MUKESH VARMA | 2511101629 |
| 478 | S. ASHWITHA | 2511101409 |
| 473 | M. VISHNU PRASAD | 2511102064 |
| 469 | E. BHARATH | 2511102592 |
| 468 | B. MANOJ KUMAR | 2511101921 |
| 468 | S. MUNI | 2511102236 |
| 456 | B. RAM CHARAN | 2511101455 |
| 453 | G. VENKATESH | 2511101659 |
| 448 | J. NITHIN | 2511101697 |
| 448 | T. RAMA RAJU | 2511102564 |
| 443 | A. RITHIK SAGAR | 2511101781 |
| 441 | S. BHAVYA SRI | 2511102386 |
| 437 | J. ISHWARYA | 2511101707 |
| 426 | K. SAITEJA | 2511101539 |
| 420 | J. SANDEEP | 2511102106 |
| 417 | M. VINIL KUMAR | 2511101877 |
| 415 | E. RAJESH | 2511102118 |
| 411 | SK. NEHA | 2511102476 |
| 411 | J. RAM CHARAN | 2511101513 |
| 411 | G. JESSICA | 2511102578 |
| 387 | V. SHIVA KUMAR | 2511102396 |

ADMISSIONS ARE IN PROGRESS

## పోలాండ్ లో మల్యాల వాసి మృతి



**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్ గౌడ్ (29) పోలాండ్ దేశంలోని పిస్కీ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొని మృతి చెందినట్లు సమాచారం. ఐదు నెలల క్రితమే స్వదేశానికి వచ్చి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు.



PRAGATHI, Hnk. 98490 69555

**మా ప్రత్యేకతలు**

- మేనేజ్‌మెంటే ఉపాధ్యాయులుగా నిర్వహించబడుతున్న విద్యాసంస్థ
- ఆధునిక విద్యాబోధనకు డిజిటల్ స్మార్ట్ క్లాస్
- IIT & MEDICAL ఫౌండేషన్ కోర్సు
- యాజమాన్యం విద్యార్థులతో పాటు పాఠశాల క్యాంపస్‌లోనే ఉంటూ స్వీయ పర్యవేక్షణలో నడుపబడుతున్న ఏకైక విద్యాసంస్థ
- యోగా, మెడిటేషన్, క్విజ్ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు
- కారాటే, సెల్ఫ్ డిఫెన్స్ కోర్స్
- నర్సరీ విద్యార్థులకు ప్లేవే పద్ధతిలో విద్యాబోధన
- ABACUS, VEDIC MATHS
- శుచి, రుచికరమైన సంతులిత భోజన సదుపాయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- అతి సాధారణ విద్యార్థులను అసాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దడం మా ప్రత్యేకత
- మానవీయ, నైతిక విలువలతో కూడిన లౌకిక పరిజ్ఞానాన్ని అందించడం
- ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కి ప్రత్యేక ప్రాధాన్యత.

అడ్మిషన్లు ప్రారంభమైనవి



P. Ramesh
M.A. HPT
Chairman

హాస్టల్ నందు పరిమిత సీట్లు

MOTHER'S LAND HIGH SCHOOL MLHS NARSAMPET
ESTD: 2003

# మదర్స్‌ల్యాండ్ హైస్కూల్

నర్సరీ నుండి 10వ తరగతి వరకు డే, సెమి రెసిడెన్షియల్ & రెసిడెన్షియల్

మెయిన్ బ్రాంచ్: సుభాష్ బొమ్మ దగ్గర, నర్సంపేట.

© 9959284472, 9704316282

హాస్టల్ క్యాంపస్: రెడ్డి ఫంక్షన్ హాల్ ప్రక్కన, నెక్కొండ రోడ్, నర్సంపేట



## ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వాలి

**బీజేపీ మానకొండూరు అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి**

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడికక్కడే పేరుకుపోయి మిల్లులకు తరలించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి ఆరోపించారు. ఇటీవల రహీంఖాన్ పేట గ్రామంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకి సమస్య విన్నవించినా ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం చూపలేదని విచారం వ్యక్తం చేశారు. మరో పది రోజుల్లో రోహిణి కార్తె ప్రారంభం అవుతుందని.. రైతులు నార్లు పోసుకునే సమయం వచ్చిన యాసంగి పంట ఇంకా కల్లాల్లోనే ఉందన్నారు. లారీలు రాక, ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించడానికి అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ఎక్కడికక్కడే ధాన్యం పెరుకుపోయిందన్నారు. వర్షం కురిస్తే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని ధాన్యం తరలించడానికి ట్రాక్టర్లకు అనుమతి ఇప్పించాలన్నారు. ధాన్యం తరలించడంలో నిర్లక్ష్యం చేస్తే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

# సిందూర్ పేరు కాదు.. ప్రజల మనోభావం

## ప్రధాని నరేంద్రమోదీ

- ఉగ్రమూకలపై ఊహించని దెబ్బ
- సైనికుల పరాక్రమం, సాహసాలకు సెల్యూట్
- మూడు రోజుల్లో పాక్ పరుగెత్తుకొచ్చింది
- దాయాది రక్షణ వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం
- భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు
- అణు యుద్ధం అంటే అంతుచూస్తాం
- ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతి ఆడబిడ్డకు అంకితం
- ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగలేవు.
- రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవు
- చర్చలు కేవలం ఉగ్రవాదం, పీవోకేపైనే..
- ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశాం


**న్యూఢిల్లీ :** మా తల్లుల నుదుటున సిందూరం చెరిపేస్తే ఏం జరుగుతుందో చేసి చూపించామని ప్రధా ని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరు కాదని అది ప్రజల మనోభావాల ప్రతిబిం బమని స్పష్టం చేశారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా మన సైన్యం వారిని దెబ్బ తీసిందన్నారు. సైనికుల పరాక్రమం, సాహసాలకు, శాస్త్రవేతలకు సెల్యూట్ చేస్తు న్నానని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుద ముట్టిస్తామని స్పష్టం చేశారు. 'న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్'కు పాల్పడితే సహించేది లేదని పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని ప్రకటించారు.

**సైన్యం సాహసం, పరాక్రమానికి సెల్యూట్**

కొన్నిరోజులుగా మనమందరం దేశ సామర్థ్యం, సహనాన్ని రెండింటినీ చూశామన్నారు. భారత దేశ పరాక్రమ సేనకు, సరిహద్దు బలగాలు, నిఘా సంస్థలు, శాస్త్రవేత్తలకు ప్రతి భారతీయుడి తరపున సెల్యూట్ చేస్తున్నానన్నారు. మన వీర సైనికులు 'ఆపరేషన్ సిందూర్'లో కచ్చితత్వంతో అసమాన శౌర్యాన్ని చూపిస్తూ లక్ష్యాలను ఛేదించారని ప్రశంసించారు. వారి వీరత్వం, పరాక్రమం, సాహసానికి సెల్యూట్ చేస్తున్నా.. మన దేశంలోని ప్రతి తల్లి, ప్రతి సోదరి, ప్రతి కుమార్తెకు ఈ పరాక్రమం అంకితం అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రవాదులు క్రూరత్వాన్ని చూపించారు. ఈ ఘటన దేశాన్ని, యావత్ ప్రపంచాన్ని వణికించిందన్నారు. సెలవుల్లో గడిపేందుకు వెళ్లిన అమాయకులను మతం అడిగి మరీ కుటుంబ సభ్యుల ముందే నిర్దయగా కాల్చి చంపడం అమానవీయమన్నారు. ఇది ఉగ్రవాద బీభత్సానికి, క్రూరత్వానికీ ప్రతీక. దేశంలోని సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగతంగా నాకెంతో ఆవేదన కలిగించిందన్నారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు భారతీయ సైన్యానికి పూర్తి స్వేచ్ఛను కల్పించామన్నారు.

**పాక్ చర్చలకు పరుగెత్తుకొచ్చింది**

పౌరులు, పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచాయని తెలిపారు. భారతీయ మహిళల నుదుట సిందూరాన్ని చెరిపేస్తే.. దానికి సమాధానం ఎలా ఉంటుందో ప్రతి ఉగ్రవాది, ఉగ్రసంస్థకూ అర్థమైందని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్.. ఒక పేరుకాదు.. ఇది దేశంలోని కోట్లాది మంది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉంది. ఆపరేషన్ సిందూర్ న్యాయం కోసం ఒక అఖండమైన ప్రతిజ్ఞ అన్నారు. ఆ ప్రతిజ్ఞతోనే ఉగ్రవాదులు కలలో కూడా ఊహించనంత దారుణంగా భారత్ దెబ్బ తీసిందని తెలిపారు. ఉగ్రవాదుల శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు కచ్చితమైన లక్ష్యంతో దాడులు నిర్వహించాయి. బహావల్‌పుర్, మురుద్కే లాంటి తీవ్రవాద స్థావరాలపై దాడి చేసి భీతావహ పరిస్థితిని సృష్టించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సానుభూతిపరులకు ఏం చేస్తుందో భారత్ చెప్పిందన్నారు. పాక్ గర్వంగా చెప్పుకునే మిసైళ్లను ధ్వంసం చేశామని, దాయాది విమానాలు గాల్లోకి ఎగరలేని పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు. మన చర్యలకు బెంబేలెత్తిపోయిన పాకిస్థాన్ కాల్పుల విరమణ కోసం ప్రపంచం మొత్తాన్ని వేడుకున్నదని గుర్తు చేశారు. పాక్ డీజీఎంవో కాల్పుల విరమణ చర్చలకు పరిగెత్తుకుంటూ వచ్చారన్నారు.



**పాక్ రక్షణ వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం..**

'రెండున్నర దశాబ్దాలుగా పాక్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఉగ్రవాద తండాలను ఒక్క దెబ్బతో భారత్ తుడిచిపెట్టింది. మన దేశానికి వ్యతిరేకంగా పాక్ నుంచి కుట్రలు పన్నుతున్న ఉగ్రతండాలను తుదముట్టించింది. మన దెబ్బకు పాక్ నిరాశనిస్పృహల్లో కూరుకుపోయింది. అచేతనావస్థకు చేరుకుంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాల్సింది పోయి పాకిస్థాన్.. భారత్‌పై దాడిని ప్రారంభించింది. మన స్కూళ్లు, కాలేజీలు, గురుద్వారాలు, సామాన్య పౌరుల నివాసాలే లక్ష్యంగా దాడులు చేసింది. మన సైనిక స్థావరాలను టార్గెట్ చేసుకున్నది. దాంతో పాక్ నిజస్వరూపం, కుట్రలు బట్టబయలయ్యాయి. పాక్ నుంచి ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను మన క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దులు దాటకుండానే కూల్చేసింది. పాక్ రక్షణ వ్యవస్థలను భారత క్షిపణులు చిన్నాభిన్నం చేశాయి. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లలో మన మిసైళ్లు విధ్వంసం సృష్టించాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్థాన్ అసహ్యకరమైన సత్యాన్ని ప్రపంచం మరోసారి చూసింది. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైన్యంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజానికి ఇంతకన్నా పెద్ద సాక్ష్యం ఇంకేం కావాలి?' అని మోదీ అన్నారు.

### భారత్ నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు..

ఎలాంటి దుస్సాహసానికి పాక్ తెగబడినా మన దళాలు చావు దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విస్పష్టంగా చెప్పాయన్నారు. ఉగ్రవాదంపై షరతుల మేరకే చర్చలు ఉంటాయని తెలిపారు. మన నిర్ణయాలకు అనుగుణంగానే చర్చలు సాగుతాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఎక్కడ ఉన్నా భారత్ తుదముట్టించి తీరుతుంది.

### అణు యుద్ధం అంటే అంతుచూస్తాం..

పాకిస్థాన్ అణు బ్లాక్‌మెయిలింగ్ ఇక సహించేది లేదు. అణుశక్తి, అణ్వాయుధాల ఆధారంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోం. అణు బాంబులతో బెదిరిస్తే అంతుచూస్తాం. భారత రక్షణ దళాల సామర్థ్యం ఏంటో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ చవిచూసింది. సాంకేతిక యుద్ధంలో భారత్ పరిణతి, ఆయుధ సంపత్తిని ప్రదర్శించింది. మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థలు ఎంత బలమైనవో.. ఎంత శక్తిమంతమైనవో చాటిందన్నారు.

### రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవు

ఈ యుగం యుద్ధాలది కాదు.. ఉగ్రవాదానిది అంతకన్నా కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు, దాడులకూ భారత్ వెనుకాడదు. ఉగ్రవాదానికి అన్న పానీయాలు అందించే ఎవరినీ ఉపేక్షించదు. పాక్ బతకాలంటే ఉగ్రవాద శిబిరాలను తనంతట తానుగా తుడిచి పెట్టాలి. టెర్రరిజం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవు. ఉగ్రవాదం, వాణిజ్యం రెండూ ఏకకాలంలో ఉండవు. రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవు. పాక్‌తో చర్చలు జరిగితే అది ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే' అని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తీరును ఎండగడుతూనే తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

### ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశాం

అణ్వాయుధాల బ్లాక్ మెయిల్‌ను ఇక సహించేది లేదు. పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది.. అదే ఉగ్రవాదం చేతిలో అంతమవుతుంది. ఈ యుద్ధంలో మేకిన్ ఇండియా ఆయుధాలు బాగా పనిచేశాయి. చనిపోయిన ఉగ్రవాదుల్ని చూసి పాక్ ఆర్మీ ఆఫీసర్లు కన్నీళ్లు పెట్టుకున్నారు. దీన్ని బట్టి పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ ఆర్మీ ఆఫీసర్లు ఉన్నారని అర్థమవుతుంది. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశాం. భవిష్యత్‌లో పాక్ చర్యను బట్టి భారత్ అదే స్థాయిలో స్పందిస్తుందని తెలిపారు.



## ఘనంగా హనుమాన్ మహాయాగం..

**కలంజ్యోతి, నర్సంపేట :** పట్టణంలోని సర్వపురంలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ మహాయాగం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెనుముద్దల శ్రీధర్ రెడ్డి, ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## లఘు చిత్రం ఆవిష్కరించిన జిల్లా విద్యాధికారి రాము

**కలంజ్యోతి, జగిత్యాల :** కృష్ణ చైతన్య ట్యూన్స్ యూట్యూబ్ చానెల్ వారు నిర్మించిన అక్కినపెల్లి సతీష్ దర్శకత్వం వహించిన "నాన్న వచ్చేయి"లఘు చిత్రం యొక్క పోస్టర్ ను మరియు చిత్రాన్ని జిల్లా విద్యాధికారి కె.రాము గారు విడుదల చేశారు. ఆటల కోసం చదువును, చదువు కోసం ఆటలను నిర్లక్ష్యం చేయకూడదని, పిల్లలకు ఆటలు చదువు రెండు ముఖ్యం అనే ఈ షార్ట్ ఫిలిం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ షార్ట్ ఫిలిం ప్రాథమిక పాఠశాల ఆలూరు మండల రాయికల్ విద్యార్థులు నటించగా ఆ పాఠశాల నందు చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టి యుటిఎస్ జగిత్యాల జిల్లా,అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్ రావు, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



## సీనియర్ పిల్లల వైద్యులు కోటగిరి కృష్ణమూర్తి మృతి

### పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**కలంజ్యోతి, జగిత్యాల :** పట్టణానికి చెందిన సీనియర్ పిల్లల వైద్యులైన కోటగిరి కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మృతుడి కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట రెడ్ క్రాస్ రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, ఆడవాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యాన్వేషణ మార్గదర్శి గౌతమ బుద్ధుడు

### బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



**కలంజ్యోతి, నిర్మల్ :** పనికి రాని వెయ్యి మాటల కంటే మనిషిని శాంతియుతంగా మార్చే ఒక్క మంచి మాట మేలు అనే మాటతో అనేక మంది వ్యక్తులను సత్యాన్వేషణ కోసం తయారుచేసిన వ్యక్తి గౌతమ బుద్ధుడని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని బుద్ధ విహార్ లో సోమవారం గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధ ఉపాసకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి రోజున బుద్ధుని జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వల్ల మనం బుద్ధుని ధర్మాన్ని, ఆయన సద్గుణాలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాం నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసిమ్మే రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, అలివేలు మంగ, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేపీ సీనియర్ నాయకులు సత్యం చంద్రకాంత్, తాజా మాజీ కౌన్సిలర్ ఎడిపెల్లి నరేందర్, సుధాకర్, పొన్నం నారాయణ గౌడ్, కొండాజి శ్రావణ్, కందుల రవి, బట్టు లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవ వేడుకలో..

నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం కాల్వలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ శాంతులతో ఉండాలని, రైతాంగానికి మేలు జరగాలని, యుద్ధ భూమిలో భారత సైనికులకు ఆత్మ స్థైర్యం పెంపొంది, విజయం చేకూరాలని ఆకాంక్షించారు.



# బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఎస్పీ అశోక్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం పోలీసు జిల్లా కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం సరికాదు

## జెడ్పీ మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్



**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రయివేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని జెడ్పి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. డిగ్రీ విద్యార్థులు, యాజమాన్యం సమస్యలు దృష్టిలో ఉంచుకొని వాటి పరిష్కారం చేయాలనీ కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరెట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వసంత మాట్లాడుతూ.. శాతావాహన యూనివర్సిటీ పరిధిలో విద్యార్థులు, యాజమాన్యం తీవ్రంగా ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. కళాశాలకు సంబంధించిన 6వ సెమిస్టరు పరీక్షల నిర్వహణపై తీవ్ర గందరగోళం ఏర్పడిందన్నారు. ఈ నెల 14 నుంచి పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం, నేటికీ హాల్ టికెట్లు రాక ఇబ్బందులు ఎదుర్కోవడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నరన్నారు. యూనివర్సిటి వైస్ ఛాన్స్ లర్ మొండి ప్రవర్తన కారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందనే ప్రచారం సాగుతుందన్నారు. ఇలాంటి వైఖరి సరికాదని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకోని పోయి పరిష్కారం కోసం ప్రయత్నం చేయడంలో వైస్ ఛాన్స్ లర్ విఫలం అయ్యారని ఆరోపించారు. ప్రభుత్వం సైతం మొండి వైఖరి విధానం కాకుండా విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం కు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు, విద్యార్థుల పరీక్ష ల నిర్వహణపై పునః పరిశీలన చేయాలని కోరారు. ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు తమ పంతం నెగ్గించుకునేందుకు యాజమాన్యం లను బెదిరించ డం, విద్యార్థులని ఒత్తిళ్లకు గురి చేయడం సరికా దన్నారు. యాజమాన్యం, విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉండి, ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉంటామని వసంత స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల స్పందించిన జిల్లా పరిషత్ తొలి ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్లర్ తో ఫోన్ లో మాట్లాడగా, ప్రభుత్వం నిర్ణయం అని దీనికి యూనివర్సిటీ తరుపున చేసేది ఏమి లేదని పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలనీ వసంత విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహేష్, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, రాయకల్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, కో ఆర్డినేటర్ శ్రీధర్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రావు, చింత గంగాధర్, రిజ్వాన్, హరీష్ , ప్రణయ్, ప్రతాప్, భగవాన్, సాయి , వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# 17న పసునూరు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ సభ




**కలంజ్యోతి, నాగారం :** మహనీయులు బడుగు, బలహీన వర్గాల, అట్టడుగు జాతుల ఆశాజ్యోతులు, పేదల ఇండ్లల్లో వెలుగు దివిటీలు, సబండ కులాల తలరాతలు మార్చిన మహనీయులు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాల ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, విగ్రహాల కమిటీ ఉత్సవాల ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ మల్లెపాక అనిల్ కుమార్ మాదిగ సబ్బండ కులాలకు, మాదిగ జాతి బిడ్డలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన మండల పరిధిలోని పసునూరు గ్రామంలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ, సభ జరుగుతుందని ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసభకు మందకృష్ణ మాదిగ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, డాక్టర్ ఏపూరి సోమన్న హాజరుకానున్నట్లు తెలిపారు. దళిత జాతుల అభ్యున్నత కోసం పాటుపడిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు విజయవంతం చేయాలని దళిత జాతి, మాదిగ బిడ్డలకు పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, ఆర్డీఓలు మధు సుధన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# నర్సుల సేవలు వెలకట్టలేనివి

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్


**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** రోగులకు నర్సులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లింగంపల్లిలోని పద్మ అపార్ట్ మెంట్ లో వివిధ వైద్యశాలలో సేవలందిస్తున్న నర్సులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తి వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య అధర్ హబీబ్ సిద్ధిఖి, స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అతిథులుగా డాక్టర్ బీసీ రామన్న సత్యసాయి సేవా సమితుల కన్వీనర్, ఈ.దేవానంద్ యాదవ్ సోషల్ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తిని అంకిత భావంతో, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్య రక్షణలో సేవలందిస్తున్న నర్సులందరికీ శతకోటి కృతజ్ఞతలు, వారికి అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేవానంద్ యాదవ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ.జనార్ధన్, అమ్మయ్య చౌదరి, కొండల్ రెడ్డి, బాలరాజు, విజయలక్ష్మి, నాగమణి, జి. వి.రావు, సత్యనారాయణ, ప్రేమ్ సింగ్, జిల్ మల్లేష్, ఖాదర్ మొయినుద్దీన్, శివపామిరెడ్డి, ఇమామ్, పాండు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు పోరాడుదాం

## సీఐటీయూ మండల కన్వీనర్ జన్ను రమేష్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ చెన్నారావుపేట మండల కన్వీనర్ జన్ను రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, మోడీ పాలనలో పోరాడుతూ కాపాడుకోవలసిన గత్యంతరం ఏర్పడిందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్తంగా అన్ని ఉద్యోగ, వ్యవసాయ, ఉపాధి కూలీలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20 జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో సీఐటీయూ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు, జీపీ కార్మికులు, కార్మికులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ జిల్లా కార్యదర్శి అబ్బా దాసి అశోక్ దూడయ్య, రాజు, రవి తిరుపతి, సాయి చందు, ఎండి పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వేణుగోపాల వేంకటేశ్వరస్వామి కల్యాణం

**కలంజ్యోతి, నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటలోగల శ్రీవేణుగోపాల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,భక్తజనం పాల్గొన్నారు.




## మల్యాల కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు


**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎంపీసీ , కంప్యూటర్ సైన్స్ గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి స్రవంతి తెలిపారు. ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, కంప్యూటర్ సైన్స్ గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు . విద్యార్థినిలు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పదో తరగతి షార్ట్ మెమో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



## తహసీల్దార్ ఎదుట బైండోవర్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** గుడుంబా కేసులో పాత నేరస్థులుగా ఉన్న నెక్కొండ ఈర్జాత్ తండాకు చెందిన గుగులోతు బాలి భర్త వెంకన్నను సోమవారం నర్సంపేట ఎక్సైజ్ పోలీసులు చెన్నారావుపేట తహసీల్దార్ ఫణి కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ.. రాష్ట్రంలో గుడుంబా తయారీ నిషేధమని, చట్ట విరుద్ధంగా ఎవరైనా గుడుంబా తయారు చేస్తే చట్టరీత్యా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారికి రూ.2 లక్షల రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు. అదేవిధంగా నిందితులకు ప్రభుత్వ పరంగా వచ్చే రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు రద్దు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తుంగలోకి పీసా చట్టాలు..




- దర్జాగా రియల్ ఎస్టేట్ దందా
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ వెంచర్లు
- అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయాలు
- నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** ఏజెన్సీ ఏరియాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం వర్ధిల్లుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం నందతండా గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లాగా వస్తున్నాయి. పచ్చని పంట పొలాలను బీడు భూములుగా మార్చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యా పారులు తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసి, రూ.కోట్లల్లో లాభాలు సంపాదిస్తున్నారు. నందతండా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్థలాలను విక్రయిస్తున్నారు. నిబంధనలకు తూ ట్లు పొడిచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసా గిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహి స్తున్న ఫారెస్ట్ ఉద్యోగి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రక్షణ చట్టాలైన 1/70, 1/59, పీసా చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. ఒకప్పుడు జిల్లా, పట్టణ ప్రాంతాలకు పరిమితమైన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమక్రమంగా గిరిజన ప్రాంతాలకు పాకింది. వ్యవసాయ సాగు భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించాలంటే అనేక అనుమతులు పొంది ఉండాలి. జిల్లా ఉన్నత అ ధికారులు మండల స్థాయి అధికారులు గ్రామ పంచాయతీ అధికారుల దగ్గర నుండి అనుమ తులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. అగ్రికల్చర్ వ్యవసాయ భూములను నాన్ అగ్రికల్చర్ వ్యవసాయ భూములుగా జిల్లా ఉన్నత రెవెన్యూ అధికారుల వద్ద మార్చవలసి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు చెల్లించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొని నాలా పర్మిషన్ రోడ్డు నిర్మాణము గ్రీన్ ల్యాండ్ కరెంటు లైన్ సైడ్ డ్రైనేజీ కాలువలు మౌలిక వసతులు కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్ 2018 చట్ట ప్రకారము గ్రామపంచాయతీ పరిధిలో నూతన నిర్మాణాలు ఏర్పాటు చేయాలంటే స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలను అడ్డుకట్ట వేసి గిరిజన చట్టాలను కాపాడాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

### ప్లాట్లుకొని ఇబ్బంది పడొద్దు


నందతండా గ్రామపంచాయతీ కార్యాలయం ఎటువంటి వెంచర్లకు ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. రియల్ ఎస్టేట్ చేస్తున్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, నోటీసులను పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశాము. రియల్ ఎస్టేట్ చేస్తున్న ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులకు గురి కావొద్దు. ప్లాట్లు కొని ఇళ్లు నిర్మించుకుంటే కొత్త ఇంటి నంబర్ జారీ చేయడం కుదరదు. అక్రమంగా నిర్వహిస్తున్న వెంచర్ పై తగిన చర్యలు తీసుకుంటాము.

– సత్యనారాయణ, ఎంపీఓ, చుంచుపల్లి



# ఆర్టీఐ కమిషనర్లుగా నలుగురు

- ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- ముగ్గురి నియామకంపై అభ్యంతరం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




**కలంజ్యోతి, హైదరాబాద్ :** గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కమిషనర్ల నియామక కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. ఆర్టీఐ కమిషనర్లుగా పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ఎట్టకేలకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురి పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైల్‌ను పంపింది. తాజాగా ఆయన ఆమోదం తెలపడంతో ప్రభుత్వం వారి నియామకంపై సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆర్టీఐ కమిషనర్లుగా ఏడుగురికి ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ప్రస్తుతం నలుగురి పేర్లను మాత్రమే ప్రకటించగా మరో ముగ్గురికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే ఆర్టీఐ చీఫ్ కమిషనర్ గా చంద్రశేఖర్ రెడ్డి మే 5న బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలం బోరెగాన్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి 1991 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి. ఆయన ఏప్రిల్30 వరకు పీసీసీఎఫ్‌గా, అంతకుముందు సీఎంవో సెక్రటరీగా పని చేశారు. ప్రస్తుతం ఆర్టీఐ కమిషనర్లుగా నియమితులైన వారిలో ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ పీవీ శ్రీనివాస్ రావు ఉన్నారు. ఆయన గతంలో ప్రముఖ ఛానల్స్ లో పనిచేశారు. ఇక యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన అయోధ్యరెడ్డి మీడియా సంస్థల్లో పని చేసి ప్రస్తుతం సీఎం సీపీఆర్వోగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయనను ఆర్టీఐ కమిషనర్‌గా నియమించడంతో సీఎం సీపీఆర్వోగా మరోకరికి అవకాశం ఇస్తారన్న ప్రచారం సాగుతున్నది. ఇక మైనార్టీ కోటాలో పర్వీన్ మొహిసిని ప్రభుత్వం ఎంపిక చేసింది. మరో ముగ్గురి పేర్లను ప్రభుత్వం గవర్నర్ పరిశీలనకు పంపినప్పటికీ వారి విషయంలో గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో ప్రస్తుతం నలుగురికి మాత్రమే అవకాశం వచ్చింది.

**పెండింగ్ లో 10,688 ఆర్టీఐ దరఖాస్తులు**

గడచిన రెండు సంవత్సరాలుగా ఆర్టీఐ కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాంతో దాదాపు 10,688 ఆర్టీఐ దరఖాస్తులు పెండింగ్ లో ఉండిపోయాయి. ఈ విషయమై పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా ఆలస్యంపై సుప్రీంకోర్టు 2025 జనవరిలో ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాక ఆర్టీఐ నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అయితే గత కొన్నేళ్లుగా వినపడుతున్న వారినే ప్రభుత్వం నియమించడం గమనార్హం. ఈ విషయంలో పలువురు దరఖాస్తుదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తన ఇష్టానుసారం ఆర్టీఐ కమిషనర్ల నియామకం చేయాలనుకున్నప్పుడు దరఖాస్తులు స్వీకరించడం దేనికని వారు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద ఖాళీగా ఉన్న ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఎంపిక చేసిన వారి జాబితాను రాష్ట్ర రాజ్‌భవన్‌కు పంపింది. గవర్నర్ అభ్యంతరం చెప్పిన వారిని మినహాయించి మిగిలినవారిని కమిషనర్లుగా ప్రభుత్వం నియమించింది.

# పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించండి

## డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ కు వినతిపత్రం అందజేశారు. శతాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, నిర్మల్ పట్టణ అధ్యక్షులు చిన్ను, వివిధ మండల పార్టీ అధ్యక్షులు భుజంగ శ్రీనివాస్ రెడ్డి, ఓడ్నాల రాజేశ్వర్, గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, బొల్లోజీ నర్సయ్య, ఏనుగు లింగారెడ్డి, కొర్వ నవీన్, ఈటల శ్రీనివాస్, కొండ శ్రీనివాస్, గాజుల రవి కుమార్ తదితరులు ఉన్నారు.





# ఇందిరమ్మ ఇళ్లకు లక్ష్మాపురం పైలెట్ ప్రాజెక్టు


## నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ ఏఈ కాసాని మౌనిక

**కలంజ్యోతి, నాగారం :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను మండల ఏఈ కాసాని మౌనిక సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మాపురం పైలట్ ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. భీష్మెంటుకు రూ.1,00,000/ అమౌంట్ తీసుకొని వచ్చిన డబ్బుతో ఇల్లుని పూర్తిచేసి ప్రభుత్వం నుండి వచ్చు మిగతా అమౌంట్ బిల్లును త్వరగా తీసుకోవాలని లబ్ధిదారులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బి.గోపి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు మల్లెపాక వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ తడకమళ్ళ నాగమల్లయ్య, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్ చిప్పలపెల్లి శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాగంటి అంజయ్య, చిప్పలపెల్లి సలీం, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలు చిప్పలపెల్లి కవిత, తదితరులు పాల్గొన్నారు.

# సొంత పార్టీలోనే నాపై కుట్రలు

## ఎమ్మెల్సీ కవిత

### సమయం వచ్చినప్పుడు బయటపెడతా



**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం పాటుపడుతున్న తనపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత సొంత పార్టీ నేతలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై కుట్రలు ఎవరు చేస్తున్నారో తెలుసన్నారు. సమయం వచ్చినప్పుడు అన్నీ బయటకు వస్తాయని కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో చిట్ చాట్ చేశారు. తాను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నానని స్పష్టం చేశారు. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలనే చెప్తున్నానన్నారు. ఉన్న పరిస్థితుల ఆధారంగానే సామాజిక తెలంగాణ అంశాన్ని ప్రస్తావించినట్లు వెల్లడించారు. పార్టీపై ప్రజల్లో రోజురోజుకూ నమ్మకం పెరుగుతుందని ఈ సమయంలో తనపై ఈ రకమైన దుష్ప్రచారం సరికాదన్నారు. నేను ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా... ఇంకా నన్ను కష్టపెడతారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. తనను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తానని ఘాటుగా స్పందించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందనుకుంటున్నానని చెప్పారు.



# పర్పుల్ డ్రెస్‌లో కాయదు..

కాయదు లోహర్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది! ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఊదా రంగు గౌనులో ఆమె చాలా అందంగా కనిపిస్తోంది. ఆమె నమ్మకంగా నిలబడిన తీరు, సొగసైన రూపం, ఆకర్షణీయమైన నవ్వు చూసిన వారంతా 'వావ్' అంటున్నారు. అయితే ఈ ఫోటో ఇంత ప్రత్యేకంగా ఉండడానికి వెనుక చాలా మంది కృషి ఉంది. ఈ అద్భుతమైన ఫోటోషూట్ కోసం ఒక మంచి టీమ్ పనిచేసింది. ఆమె పెట్టుకున్న మెరిసే నగలు ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌వి. ఆమె వేసుకున్న దుస్తులు, మొత్తం స్టైలింగ్‌ను ఒకరు చేయగా, వారికి సహాయంగా మరికొందరు ఉన్నారు. ఈ అందమైన ఫోటోను తీసిన ఫోటోగ్రాఫర్ చాలా బాగా పనిచేశారు. ఆమె మెరిసే జుట్టును ఒక స్టైలిస్ట్ అందంగా దువ్వారు, అలాగే ఆమె ముఖానికి మరింత అందం వచ్చేలా మేకప్ వేశారు. ఇలా వీరందరూ కలిసి ఈ ఫోటోను ఒక మ్యాజిక్‌లా తీర్చిదిద్దారు. మరి ఈ ఫోటోలలో కనిపిస్తున్న కాయదు లోహర్ ఎవరు? ఆమె ఒక కొత్త నటి. సౌత్ సినీ పరిశ్రమలో తనకంటూ ఒక స్థానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా ఇటీవల వచ్చిన ఒక సినిమాలో ఆమె కనిపించిన తర్వాత చాలా మంది యువతకు ఆమె క్రష్ అయిపోయింది.